కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :96 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ బుధవారం 29-07-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## ఝార్ఖండ్‌లో 16 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగలింది. ఐదుగురు మహిళలతో సహా 16 మంది మావోయి స్టులు మంగళవారం ఝార్ఖండ్ రాజధాని రాంచీలో పోలీసుల ఎదుట లొంగిపో యారు. పలు ఆయుధాలను అప్పగించారు. అందులో రెండు ఏకే-47 రైఫిల్స్ ఉన్నాయి. లొంగిపోయిన వారిలో ఆరుగురిపై మొత్తం రూ. 39 లక్షల రివార్డు ఉందని సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన వారిలో సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ కూడా ఉన్నారని, ఇతనిపై 128 కేసులు నమోదై ఉన్నాయని మరియు రూ. 15 లక్షల రివార్డు ఉందని ఆయన పేర్కొన్నారు.వీరిలో ఐదుగురు మహిళా సభ్యులు కూడా ఉన్నారు. నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) ప్రాంతీయ కమిటీ సభ్యుడైన సంతోష్ మహతో లొంగిపోవడం జార్ఖండ్ పోలీసులకు ఒక గొప్ప విజయమని జార్ఖండ్ డీజీపీ తదాష మిశ్రా పేర్కొన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 128 కేసుల్లో సంతోష్ నిందితుడిగా ఉన్నాడు. లొంగిపోయిన మవోస్టులందరికి




చట్టపరంగా పునరావాసం కల్పిస్తామన్నారు. రాష్ట్రాన్ని నేరరహితంగా మార్చేందుకు జార్ఖండ్ పోలీసులు నిబద్ధతతో పని చేస్తున్నారని డీజీపీ తెలిపారు.

## కృత్రిమ సూర్యుడి కోసం అతిపెద్ద అయస్కాంతం ఆవిష్కరించిన చైనా

సమస్త జీవకోటికి ఆధారం, గ్రహాల్లో ప్రధానం సూర్యుడు (రాబఅ). అలాంటి సూర్యుడిని కృత్రిమంగా సృష్టించాలని భావిస్తుంది చైనా. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ ఫ్యూజన్ (రాబజూవతీ జశీఅ-ఎబఙ్ఖఅస్త్ర ఖీబంఱశీఅ) అయస్కాంతాన్ని రూపొందించింది. విజయవంతంగా పరీక్షించింది. దీనిలో ఉన్న టెక్నాలజీ ప్రపంచంలోని విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు.

582 టన్నుల అయస్కాంతం

చైనా కృత్రిమ సూర్యుడి ప్రాజెక్టులో భాగంగా 2030 నాటికి ఫ్యూజన్ ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద 582 టన్నులు గల అయస్కాంతాన్ని రూపొందించింది. అణు సంలీనం ద్వారా అపరిమితమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి ఈ అతిపెద్ద అయస్కాంతం కీలకం. దీన్ని విజయవంతంగా పరీక్షించి కృత్రిమ సూర్యుడిని సృష్టించాలనుకున్న చైనా లక్ష్యానికి ముందడుగు పడినట్లు అయ్యింది. 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు గల 'ఐ' ఆకారంతో ఈ అయస్కాంతాన్ని చైనీస్ అకాడమీకి చెందిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ అభివృద్ధి చేసింది.



కృత్రిమ సూర్యుడు అంటే?

అచ్చం సూర్యుడి లాగే పనిచేసే న్యూక్లియర్ ఫ్యూజన్ రియాక్టర్‌ను కృత్రిమంగా నిర్మించడం. సూర్యుడిలో 100 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ప్రతి క్షణం కొన్ని కోట్ల హైడ్రోజన్ అణువులు సంలీనం చెంది కార్బన్ డయాక్సైడ్ రహిత అపారమైన శక్తి విడుదలవుతుంది. ఇలాంటి ప్రక్రియనే భూమిపై సృష్టించి విద్యుత్‌గా మారిస్తే స్వచ్ఛమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన శక్తిని పొందవచ్చు.

## ఏపీలో ఇవ్వట్లే.. నేను కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వను..!

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీల అమలులో విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి విద్యార్థులపై పగబట్టింది. ఫీజ్ రీయింబర్స్‌మెంట్(టవవ తీవఱఎబతీంవఎవత్) కోసం ఎదురుచూస్తున్న లక్షలాదిమందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(జవీ =వఝుత్ష్ర =వంఎ) షాకిచ్చారు. ఆది నుంచి ఈ అంశంపై దాటవేస్తున్న సీఎం నేను ఇవ్వను అని కుండబద్ధలు కొట్టేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇవ్వడంలేదు తెలంగాణలో నేను కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వను అని మీడియా ముందే రేవంత్ రెడ్డి చెప్పేశారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి తప్పించుకునే ధోరణి మరోసారి బయటపడింది. పలుమార్లు సమాధానం దాటవేసిన సీఎం ఈసారి మీడియా ముందు నేను ఇవ్వను అని తేల్చేశారు. ఆర్.కృష్ణయ్య ఏపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు, ముందు అక్కడ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వమని అడగాలి ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న ఏపీలో కూడా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉంది.



ముందు అక్కడ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇచ్చాక తెలంగాణ బీజేపీ నాయకులు మమ్మల్ని విమర్శించండి అని సీఎం పేర్కొన్నారు.

## ఢిల్లీలో కుంభవృష్టి.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్

దేశ రాజధాని ఢిల్లీ లో కుండపోత వర్షం కురుస్తోంది. ఎగతెగకుండా కురుస్తున్న వర్షంతో ఢిల్లీ రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లు నదులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు తటాకాలుగా మారాయి. రోడ్లపై నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లపై వాన నీళ్లు నిలువడంతో పలు కూడళ్లలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాంతో ఉద్యోగాలకు వెళ్లేవాళ్లు, కూలీలు, కార్మికులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలావుంటే ఇప్పటికే ఢిల్లీ వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. రోజంతా వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## రేవంత్ రెడ్డి యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నాడు ? : ఎంపీ అర్వింద్

హైదరాబాద్ : రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌తో రైతుల కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. ఈ నేపథ్యంలో యూరియా కొరతపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి యూరియాను బ్లాక్‌లో అమ్ముకొని, కొరత వచ్చిందని కేంద్రంపై నెడుతున్నాడని ఆరోపించాడు.

తెలంగాణకు 2016-17లో 26.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇస్తే.. 2025-26లో 42.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రం నుండి ఇచ్చామని పేర్కొన్నారు. ఏప్రిల్ నుండి జూలై మధ్యలో డీఏపీలలో 28 షోకాజ్ నోటీసులు, 9 లైసెన్స్ క్యాన్సిలేషన్లు, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదవ్వగా వీఇపై ఇన్వెస్టిగేషన్ చేస్తే అందరూ కాంగ్రెస్ వాళ్లేనని తేలిందన్నారు. ప్రభుత్వం



అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై నిందలు వేస్తుందన్నారు.

## విద్యార్థుల నిరసన ఓ కీలక మలుపు: కేటీఆర్

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టిన అంశంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళన ఓ విశిష్టమైందన్నారు. భారత రాజకీయ వ్యవస్థలో అది కీలక మలుపు లాంటిదన్నారు. ఇక ఒకవేళ పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు. ద హిందూ మీడియాతో ఆయన మాట్లాడుతూ .. విద్యార్థుల నిరసన కేవలం పేపర్ లీకేజీలకు చెందిన అంశం మాత్రమే కాదు అని, కానీ ప్రజల్లో ఉన్న భావోద్వేగాలకు ఓ ట్రిగ్గర్ పాయింట్‌లా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, కానీ దాని నుంచి రికవరీ అయ్యేందుకు బీజేపీ ఇంకా సమయం ఉందని కేటీఆర్ అన్నారు. అయితే




ప్రతిపక్షాలకు మాత్రం ఇంకా గడ్డురోజులే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## లండన్ వీధుల్లో ఘనంగా 'టాక్ బోనాల జాతర' వేడుకలు

లండన్ : తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యూకే నలుమూలల నుండి సుమారు 2500కి పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు.టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షుడు శుష్మణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు నాయకత్వంలో ప్రారంభమైన వేడుకలకు, వ్యాఖ్యాతలుగా ప్రధాన కార్యదర్శిశ్రీకాంత్ జెల్లా, కమ్యూనిటీ అఫైర్స్ ఛైర్ పర్సన్ గణేష్ కుప్పాల వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ సీమా మల్హోత్రా, భారత హై కమీషన్ ప్రతినిధి వివేక్ కుమార్, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌన్స్లో నగర మేయర్ రంజిత్ గిల్ ఇతర అతిథులు పాల్గొన్నారు.స్వదేశంలో జరుపుకున్నట్టు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, తొట్టెల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సమేతంగా అంతా కలిసి ఇలా వేడుకలు చేసుకొని రాబోయే తరాలకి తెలియజెప్పడం ఎంతో స్ఫూర్తినిస్తుందని,. బ్రిటన్ అన్ని వర్గాల ప్రజలను, సంస్కృతుల్ని ఆదరించే గొప్ప దేశమని మనమంతా కలిసి మెలిసి ఐక్యంగా ఉండాలని ముఖ్య అతిథులు తెలిపారు.టాక్ కన్వీనర్లు అశోక్ గౌడ్ దూసరి,



నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడి తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం అయ్యేలా కృషి జరుగుతుందంటే దానికి కారణం మన ప్రత్యేక రాష్ట్రం మనకు ఏర్పాటు అవడమేనని, కాబట్టి అన్ని సందర్భాల్లో రాష్ట్ర ఏర్పాటు కొరకై ముందుండి నాయకత్వం వహించిన ఉద్యమ శిఖరం రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మనం అన్ని సందర్భాల్లో గుర్తు చేసుకోవాలని తెలిపారు.

## 2 నెలల్లో పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు పూర్తి: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లుపై ఇవాళ లోక్‌సభలో చర్చ మొదలైంది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌మాట్లాడారు. పేపర్ లీకేజీ ఘటనల్లో కఠిన శిక్ష అమలు చేసేందుకు పేపర్ లీకేజీ నిరోధక బిల్లులో సవరణ చేపట్టినట్లు తెలిపారు. సెక్షన్ 10లోని సబ్‌సెక్షన్ 1 ప్రకారం లీకేజీ పాల్పడిన వ్యక్తికి 5 ఏళ్ల వరకు జైలుశిక్ష ఉండేది. ఆ కేసుల్లో పది లక్షల జరిమానా కూడా ఉంది. అయితే సవరణ ద్వారా జైలుశిక్షను 5 నుంచి పదేళ్లకు మార్చారు. జరిమానాను 50 లక్షలకు పెంచారు. 2024 చట్టం ప్రకారం సర్వీస్ ప్రొవైడర్‌కు కోటి జరిమానా ఇస్తున్నారు. ఆ ఫైన్‌ను ఇప్పుడు 5 కోట్లకు పెంచారు. పరీక్షల నిర్వహణ నుంచి గతంలో 4 ఏళ్ల వరకు తప్పించేవారు. ఇప్పుడు సవరణ ద్వారా ఆ సమయాన్ని 8 ఏళ్లకు పెంచారు.అయితే పేపర్ లీకేజీ కేసుల్లో వ్యవస్థీకృత నేరానికి పాల్పడే మాఫియాకు కూడా శిక్షా కాలాన్ని, జరిమానాను పెంచారు. గతంలో 5 నుంచి 10 వరకు ఉన్న జైలుశిక్షను ఇప్పుడు 7 నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. గతంలో ఆర్గనైజ్డ్ క్రైంకు పాల్పడితే కోటి జరిమానా విధించేవారు. ఇప్పుడు దాన్ని పది కోట్లకు సవరించినట్లు మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వేగంగా న్యాయం అందించాలని ప్రధాని మోదీ చేసిన సూచన ప్రకారం.. స్పెషల్ టాస్క్ ఫోర్స్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటిల్లో టైం నిబంధన పెట్టినట్లు తెలుస్తోంది.




కేంద్ర దర్యాప్తు సంస్థ అయినా లేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ అయినా.. లీకేజీ కేసుల్లో దర్యాప్తును కేవలం 2 నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

## బోనం సమర్పించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గౌడ ఐక్యసాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి 13వ కల్లు ఘటం-సాక బోనం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొని రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి, సంప్రదాయబద్ధంగా కల్లు సాక పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌడల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతికి అనుగుణంగా రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ప్రారంభించామని తెలిపారు. అప్పటి నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ వేడుకలు ఇప్పుడు 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం గర్వకారణమన్నారు. గౌడల సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు



దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, బబ్బూరి భిక్షపతి గౌడ్‌తో పాటు గౌడ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జపాన్‌లో 7.1 తీవ్రతతో భూకంపం .. సునామీ హెచ్చరిక జారీ

టోక్యో: జపాన్‌లో ఇవాళ భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.1 తీవ్రతతో భూకంపం నమోదు అయ్యింది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. కుమామాటో జిల్లాలో ఈ భూకంపం నమోదు అయ్యింది. సముద్రం వద్ద ఎవరూ ఉండకూడదు అని వెదర్ ఏజెన్సీ తన హెచ్చరికల్లో పేర్కొన్నది.





సంపాదకీయం

బుధవారం 29-07-2026

# వాతావరణ మార్పులతో సరికొత్త సవాళ్లు

వాతావరణ మార్పులు సరికొత్త సవాళ్లను రువ్వుతున్నాయి. వీటి కారణంగా తలెత్తే తాగునీటి కష్టాలు, సాగు నష్టాలు, వలసలు, తీరప్రాంతాల మునక వంటివి పలుదేశాలకు సంక్షోభాలుగా పరిణమించే ప్రమాదం పొంచి ఉంది. భద్రతాపరమైన అంశాలకన్నా జన జీవన ప్రమాణాలు, నీటిలభ్యత, ఆహారభద్రత, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలే రాబోయే కాలంలో దేశాల సుస్థిరతను నిర్ణయించే అవకాశం ఉంది.ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాతావరణ మార్పుల సమస్య ఇప్పుడు దక్షిణాసియాలో జడలు విప్పుతోంది. హిమాలయ పర్వతాల్లో మంచు శరవేగంగా కరిగిపోతోంది. గంగ, సింధు, బ్రహ్మపుత్ర లాంటి నదుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది. మరోవైపు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాల్లో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వరదలు, కరవులు, తుపాన్లు, సముద్రమట్టాలు పెరగడం లాంటి పరిణామాల వల్ల కోట్లమంది ప్రజల జీవనాధారాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటిదాకా పర్యావరణ సమస్యగానే కనిపిస్తున్నప్పటికీ, ఇది భద్రతా సమస్యగానూ మారుతోంది. ఎందుకంటే, తీవ్ర కరవుకాటకాల బారిన పడుతున్న దేశాల నుంచి ఎంతోకొంత మెరుగైన దేశాల్లోకి వలసలు ఉద్ధృతంగా ఉంటున్నాయి. ఈ శరణార్థుల సమస్య భారత్ లాంటి దేశాలకూ ఎక్కువగానే ఉంటోంది.

దేశాల మధ్య వివాదాలు

సముద్రమట్టం పెరుగుదల ఇప్పటికే మాల్దీవులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆ దేశ అస్తిత్వమే సంక్షోభంలో పడు తోంది. మనదేశంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లోని తీరాలూ తరచూ వరదల బారిన పడుతున్నాయి. పాకిస్థాన్‌లో ఒకవైపు వరదలు, మరోవైపు కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. అఫ్గానిస్థాన్‌లో నీటి కొరత వల్ల రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. దక్షిణాసియాలో వాతావరణ మార్పుల ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తున్న రంగం నీటి వనరులే. భారత్, పాక్‌ల మధ్య యుద్ధాలు జరిగినా సింధునదీ జలాల ఒప్పందం చాలాకాలం అమలైంది. పహల్గాం ఘటన తర్వాత సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టకపోతే సహకారం సాధ్యం కాదంటూ భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఆ ఒప్పందం కుదిరిన సమయంలో హిమాలయాల్లోని హిమానీనదాల కరుగుదల ప్రస్తుతం ఉన్నంత స్థాయిలో లేదు. ఇప్పుడు హిమాలయ ప్రాంతమంతా వేగంగా మారిపోతోంది. ఆసియా మొత్తానికి నీటినిల్వ కేంద్రంగా పరిగణించే ఈ ప్రాంతం సామర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో నీటి వివాదాలే పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ప్రపంచంలో అత్యంత కలుషిత నగరాల జాబితాలో తరచూ దిల్లీ, లాహోర్ పేర్లు కనిపిస్తాయి. పంటవ్యర్థాల దహనం, పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాలు, వాహనాల కాలుష్యం వంటివన్నీ కలిసి ప్రతిసారీ చలికాలంలో విషపూరితమైన పొగమంచును సృష్టిస్తున్నాయి. ఒక దేశంలో మొదలైన కాలుష్యం మరో దేశ ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపవచ్చు. సమస్య పెరిగితే ఆయా దేశాల మధ్య వివాదాలను రాజేసే అవకాశాలు లేకపోలేదు. వాతావరణ సంక్షోభ భారం సమాజంలో ధనికులతో పోలిస్తే, పేదల మీదే ఎక్కువగా పడుతుంది. ప్రభుత్వం నుంచి తగినంతగా నీటిసరఫరా లేకపోయినా, కాలుష్యం పెరిగినా, ఆరోగ్య సమస్యలు ఎక్కువైనా ముందుగా నష్టపోయేది పేదలే. పేదల్లోనూ గర్భిణులు, చిన్నారులపై ఎక్కువగా ఉంటుంది. ఈ అసమానతలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తాయి. వనరులు తగ్గినప్పుడు వాటికోసం పోటీ పెరిగి, చివరికి రాజకీయ అస్థిరతకు కారణం అవుతుంది. వాతావరణ సంక్షోభానికి సాంకేతిక పరిష్కారాలు అంత సులభం కావు. ఉదాహరణకు హరిత విప్లవంతో దేశంలో ఆహారోత్పత్తి పెరిగినా, భూసార క్షీణత, భూగర్భ జలాల అధిక వినియోగం లాంటి సమస్యలు తలెత్తాయి. హరిత ఇంధనంతో కర్బన ఉద్గారాలు తగ్గుతాయంటున్నా, బ్యాటరీల కోసం లిథియం తవ్వకాలతో ఎంతోకొంత పర్యావరణ నష్టాన్ని ఎదుర్కోవాల్సిందే.

పరిష్కార మార్గమేంటి?

వాతావరణ మార్పుల సంక్షోభాన్ని అధిగమించేందుకు దేశాలు సహకరించుకోవాలి. ఉదాహరణకు పాకిస్థాన్‌లో తరచూ వరదలు, కరవు లాంటి పరిస్థితులు కనిపిస్తుంటాయి. అక్కడి వాతావరణ హెచ్చరికల వ్యవస్థ బలహీనంగా ఉంటోంది. పొరుగు దేశాలు వాతావరణ సమాచారాన్ని పంచుకోవడం ద్వారా తోడ్పాటు అందించవచ్చు. అది అన్నిపక్షాలకూ మేలు కలిగిస్తుంది. ఎందుకంటే, అక్కడ వచ్చే వరదల ప్రభావం సరిహద్దుల ఇవతల నష్టం కలిగించకుండా జాగ్రత్తపడవచ్చు. అదేవిధంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ ఇరుగుపొరుగున ఉండే చిన్నదేశాలకు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం ద్వారా నష్టాలను కొంతవరకు అధిగమించవచ్చు. ప్రకృతిని మనం కాపాడినంతకాలం అది మనల్ని రక్షిస్తుంది. విచ్చలవిడిగా ప్రకృతిని చెరబడితే దుష్ప్రభావాల బారిన పడక తప్పదు. ఈ విషయంలో దేశాలకు అప్రమత్తత తప్పదు. అన్ని దేశాలూ పరస్పర సహకారంతో ముందడుగు వేయడం ద్వారా వాతావరణ మార్పుల ముప్పును సమష్టిగా ఎదుర్కోవాలి.

# ఏపీలో స్థానిక ఎన్నికల నగారా.. 60 రోజుల్లో ఎన్నికలు..



అమరావతి,ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు హంగామా మొదలవుతోంది. ఓ వైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతోంది. మరోవైపు పార్టీలు నేతలు, కేడర్‌ను అలర్ట్ చేయడంతో రానున్న రెండు లేదా మూడు నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని సచివాలయం వర్గాలు చెబుతున్నాయి.ఏపీలో స్థానిక సంస్థల హంగామా- తొలుత సెప్టెంబర్ నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. అయితే ఏపీ వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతోంది. ఇటీవల ఎన్నికల సంఘం గడువు కూడా పెంచింది. జూలై 31 నాటికి ముసాయిదా జాబితా విడుదల కానుంది. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఆగస్టు 30లోగా సమర్పించవచ్చు. సెప్టెంబరు 28 వరకు ఆయా ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. అక్టోబరు మూడున ఓటర్ల తుది జాబితా బయటకు రానుంది.అక్టోబర్ సెకండ్ వీక్ నుంచి ఎన్నికలు-అక్టోబర్ సెకండ్ వీక్ నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. తొలుత మున్సిపల్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఇందుకోసం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. మొదట సెప్టెంబర్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన చేసింది. ఓటర్ల జాబితా సిద్ధం కాకుండా వెళ్లడం కరెక్టు కాదని భావించి వెనక్కి తగ్గినట్టు సచివాలయం వర్గాలు చెబుతున్నాయి.ప్రజల్లోకి రాజకీయ పార్టీలు- అక్టోబర్ తొలివారంలో ఓటర్ల జాబితాను విడుదల చేయనుంది ఎన్నికల సంఘం. సెకండ్ వీక్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్లాన్ చేస్తోంది. నవంబర్ ఫస్ట్ వీక్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నిలకు ప్లాన్ చేస్తోంది. పంచాయతీ ఎన్నికల నవంబర్ మూడు లేదా నాలుగో వారంలో నిర్వహించనుంది. ఓటర్ల జాబితా తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కూటమి సర్కార్ డిసైడ్ అయ్యింది. ఈ నేపథ్యంలో నేతలు, కార్యకర్తలతో పార్టీల అధినేత సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.నేతలతో సీఎం చంద్రబాబు- ఆదివారం సీఎం చంద్రబాబు కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 27 నుంచి 45 రోజులపాటు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఆదేశించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించాలన్నారు. యువత భవితకు, వాళ్ల ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, పెట్టుబడుల రాకతో ఉద్యోగాల కల్పన, చదువుల గురించి ప్రస్తావించనున్నారు.ఓ వైపు పవన్.. మరోవైపు నాదెండ్ల-అటు జనసేన పార్టీ కూడా అదే జోరు కొనసాగిస్తోంది. భుజానికి ఆపరేషన్ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యాక్టివ్ అవుతున్నారు. మరోవైపు శుక్రవారం కార్యకర్తలతో అన్ని నియోజకవర్గాల నేతలు సమావేశం విజయవాడలో జరిగింది. ప్రతీ ఒక్కరూ పవన్ కోసం పని చేయాలని కార్యకర్తలకు మంత్రి నాదెండ్ల పిలుపు ఇచ్చారు.కార్యకర్తలు, నేతలతో జగన్ వరుస భేటీలు-మరోవైపు బీజేపీ కూడా వేగంగా అడుగులు వేస్తోంది. నియోజకవర్గాల నేతలతో అధ్యక్షుడు మాధవ్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆలోచన చేస్తున్నారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ అయ్యారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమావేశాలు చేస్తున్నారు. కాకపోతే కేసుల వల్ల కొందరు నేతలు హాజరుకావడం లేదని తెలుస్తోంది. గతంలో మాదిరిగా ఈసారి 90 శాతం తామే గెలవాలన్న పట్టుదలతో వైసీపీ అడుగులు వేస్తోంది.

# క్యూర్ లో ఇళ్ల నిర్మాణ అడుగులు

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ పథకం సందేహాల నివృత్తికి హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్‌సెంటర్ నంబరు 040-24603572ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని రూ.10 వేల దరఖాస్తు రుసుం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. పారదర్శకంగా ఇళ్లు కేటాయిస్తామని.. ఎటువంటి రాజకీయాలకు తావుండదని మంత్రి స్పష్టం చేశారు.క్యూర్ పరిధిలో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ప్రజల్లోని సందేహాలను నివృత్తి చేసేందుకు హౌసింగ్ బోర్డు ప్రత్యేక కాల్‌సెంటర్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కార్యాలయంలో శనివారం రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కాల్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు గూడు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ పథకంపై ఎలాంటి గందరగోళం, అపోహలకు గురికావద్దని ఆయన స్పష్టం చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతోనే ఈ కాల్‌సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు.ఈ పథకానికి సంబంధించి దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపుల ప్రక్రియ, ఇళ్ల కేటాయింపులపై పూర్తి అధికారిక సమాచారం కోసం ప్రజలు 040-24603572 నంబరును సంప్రదించవచ్చునని చెప్పారు. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా ఈ కాల్ సెంటరుకు ఫోన్ చేయాలని మంత్రి కోరారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని చెప్పారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ నాలుగు భాషలలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల వివిధ ప్రాంతాలకు చెందిన నగర ప్రజలు తమకు నచ్చిన భాషలో అధికారులతో మాట్లాడి సమాచారం సేకరించడానికి వీలవుతుంది.క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణ లక్ష్యంలో భాగంగా.. తొలి విడతగా 7680 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సిఫారసులకు తావులేకుండా పారదర్శక విధానాన్ని అవలంబిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే ప్రజలు తాము ఏ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక కుటుంబం నుంచి కేవలం ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించబడుతుంది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కచ్చితంగా ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తారు.దరఖాస్తు సమయంలో చెల్లించాల్సిన రూ. 10 వేల మొత్తాన్ని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలి. నకలీ దరఖాస్తులను నియంత్రించడానికి, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పాటించడానికి ఈ డిజిటల్ విధానాన్ని తప్పనిసరి చేశారు. ఒకవేళ ఎవరికైనా ఇల్లు మంజూరు కాకపోతే ఎలాంటి కోతలు లేకుండా ఆ మొత్తాన్ని తిరిగి అదే ఖాతాకు వాపసు పంపిస్తారు. కాగా, ఈ కాల్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టుకు సంబంధించిన విధివిధానాలను వివరించారు




కేటుగాళ్ల పట్ల జాగ్రత్త- సీపీ

హైదరాబాద్ క్యూర్ పరిధిలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ కేటాయింపు ప్రక్రియను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళు అమాయకులను మోసం చేసే అవకాశం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. లబ్ధిదారులు, సాధారణ ప్రజలు సైబర్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రూ.10 వేల ముందస్తు డిపాజిట్ పేరుతో సైబర్ కేటుగాళ్లు నకిలీ కాల్స్, మెసేజ్‌లు పంపే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. ‘ఈ రోజే ఆఖరు తేదీ, వెంటనే చెల్లించకపోతే ఇల్లు రాదు’ అంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించి సులువుగా డబ్బులు గుంజడానికి నేరగాళ్లు ప్రయత్నిస్తారని తెలిపారు. అంతేకాకుండా.. వాట్సాప్ ద్వారా అపరిచిత లింకులు, ఎపికె ఫైళ్లను పంపి మొబైల్‌ను హ్యాక్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి లింక్స్ అస్సలు ఓపెన్ చేయవద్దని చెప్పారు.అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించి అమాయకుల వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఈ గృహనిర్మాణ పథకంలో దళారులకు, మధ్యవర్తులకు ఎలాంటి పాత్ర లేదని సజ్జనార్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, ఓటీపీలను అపరిచితులకు ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు. స్క్రీన్ షేరింగ్, రిమోట్ యాక్సెస్ యాప్‌లను ఇతరుల మాటలు నమ్మి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకూడదని హెచ్చరించారు. డబ్బులు రీఫండ్ పొందడానికి ఎప్పుడూ యూపీఐ పిన్ ఎంట్రీ చేయాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా అజాగ్రత్త వల్ల సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రజలకు సూచించారు.

# అరుతడి పంటలు మాత్రమే పండించాలి

సిద్దిపేట ,వర్షభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అరుతడి పంటలు మాత్రమే పండించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో గల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విత్తన మేళాను ప్రారంభించి రైతులకు ఆరుతడి పంటల విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురియడం లేదని, జిల్లాలో సాధారణంగా 256 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సింది ఉండగా కేవలం జిల్లాలో 176 మి వర్షపాతం మాత్రమే పడిందని అన్నారు. జిల్లాలో అన్ని మండలాలలో లోటు వర్షపాతం ఉందని హుస్నాబాద్, వర్గల్, ములుగు మండలాల్లో తీవ్ర వర్ష భావం ఉందని అన్నారు. నారువేసే సమయానికే ఇలా ఉంటే వరి కోత సమయం వరకు వరికి నీళ్లు ఎలా అందుతుందని అన్నారు. అందుకే ప్రభుత్వం ఆరుతడి పంటలు పండించుకునే విధంగా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వరి పండిస్తే ఒక ఎకరాకి ఒక రోజుకు 25 వేల లీటర్ల మీరు అవసరమని అదే నీటితో ఆరు నుండి ఎనిమిది ఎకరాల్లో మెట్ట పంటలను పండించవచ్చని అన్నారు. ఆరుతడి పంటలు పండిస్తే ఆదాయం రావడంతో పాటు నీటివినియోగం తగ్గుద్దనీ, ఈనెల 31 వరకు మొక్కజొన్న, పెసలు, మినుములు, అలసందలు, వేరుశనగ మొదలగు పంటలను వేసుకోవచ్చని, వర్షాభావ పరిస్థితుల్లో పండే రాగులు, కందులు, పొద్దుతిరుగుడు, మిల్లెట్స్, కొర్రలు, అరికెలు, ఆముదం తదితర పందాలను ఆగస్టు 30 వరకు విత్తుకోవచ్చని అన్నారు. రైతులు భూములను ఖాళీగా వదలకుండా ఖచ్చితంగా ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్ ఫామ్ వేసుకుంటే డ్రిప్, అంతరపంటలకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. జిల్లాలో కూరగాయలు, ఆకుకూరలకు మంచి మార్కెటింగ్ ఉందని వాటిని పండించాలన్నారు. విబి జి రాంజీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా వర్షపు నీటిని ఒడికట్టి భూగర్భ జలాలు పెంచుకునేలా ఫామ్ పాండ్ నిర్మించుకోవాలనీ తద్వారా భూగర్భ జలాల పెంపుతో పాటు చేపల పెంపకం కు మరియు కూరగాయలు ఇతర పంటలు వేసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. బోర్ వెల్స్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ నిర్మించి నీరు వృధా కాకుండా భూమిలోకి ఇంకెలా చూడాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల రూఫ్ టాప్ నుండి వచ్చే నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, అలాగే ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. గత రబీ సీజన్లో రికార్డు స్థాయిలో 5 లక్ష 25 మెట్రిక్ తనుల వరి ధాన్యం పండిందని ధాన్యానికి రెండు సంవత్సరాల వరకు ఇబ్బంది లేదు అని తెలిపారు. ఎలాంటి పంటలు పండించిన రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని మీ అనుభవాలను ఉపయోగించుకొని

# 29 నుంచ 45కు పెరగనున్న సిటీ అసెంబ్లీ సీట్లు

హైదరాబాద్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమల్లోకి వస్తే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాల సంఖ్య ఏకంగా 179 వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలు, జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రతి నియోజకవర్గానికి సగటున 1.95 లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకుంటే.. ఈ ప్రక్రియలో అత్యధికంగా లబ్ధి పొందేది, సీట్లను అదనంగా సాధించుకునేది గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలే కానున్నాయి.ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలు విపరీతంగా విస్తరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఆరు నుంచి ఏడు లక్షలు దాటిపోయింది. మిగతా జిల్లాల్లోని ఒక సాధారణ నియోజకవర్గంలో 2 నుంచి 2.5 లక్షల ఓటర్లు ఉంటే, హైదరాబాద్ అర్బన్ కారిడార్‌లోని ఒక్కో స్థానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండాల్సినంత జనాభా కేంద్రీకృతమైంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడమే డిలిమిటేషన్ ప్రధాన లక్ష్యం కానుంది.అంచనాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల ఉమ్మడి అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 29 నుంచి ఏకంగా 45కిపైగా పెరిగే అవకాశముంది. పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మేడ్చల్, కూకట్‌పల్లి, మహేశ్వరం వంటి అతిపెద్ద నియోజకవర్గాలను రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విభజిస్తారు. దీనివల్ల కేవలం గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల అర్బన్ పరిధిలోనే దాదాపు 16 నుంచి 20 కొత్త అసెంబ్లీ స్థానాలు పుట్టుకొస్తాయి. అంటే, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా గ్రామీణ ప్రాంతాల కంటే ఈ గ్రేటర్ బెల్ట్ సీట్లే అత్యంత కీలకం కానున్నాయి.ఈ స్థానాల పెంపు ఏ పార్టీకి రాజకీయంగా అడ్వాంటేజ్ ఇస్తుందనేది ఇప్పుడు అసలు సిసలైన చర్చ. నగర ఓటర్లలో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, ఆంధ్రా మూలాలున్న సెటిలర్లు, ఉత్తరాది వలసదారులు ఎక్కువగా ఉంటారు. చారిత్రాత్మకంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మైగ్రెన్ట్స్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో బిజెపి , బిఆర్ఎస్ పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. డిలిమిటేషన్ వల్ల నగర సీట్లు పెరిగితే అర్బన్ క్లాస్, సెటిలర్ ఓటర్ల ప్రభావం మరింత పెరిగి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువ . మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గ్రామీణ తెలంగాణలో అత్యంత బలంగా ఉండి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తక్కువ స్థానాలను కలిగి ఉంది. కాబట్టి అర్బన్ సీట్లు భారీగా పెరిగితే కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ గ్రామీణ ఓటు బ్యాంకును మాత్రమే నమ్ముకుంటే సరిపోదని, నగర నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ కొత్త సమీకరణాలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనాభా ప్రకారం కొత్త స్థానాలు ఏర్పడతాయి కాబట్టి అక్కడ తులనాత్మకంగా కాంగ్రెస్‌కు పట్టు సాధించే వెసులుబాటు కూడా ఉంటుంది.రాబోయే డిలిమిటేషన్ తెలంగాణ పొలిటికల్ పవర్ సెంటర్‌ను రూరల్ కారిడార్ నుంచి అర్బన్ కారిడార్‌కు మళ్లించబోతోంది. ఏ పార్టీ అయితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న నూతన నియోజకవర్గాల్లో పట్టు సాధిస్తుందో, ఆ పార్టీకే రాష్ట్రంలో అధికార పీఠం దక్కే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. సామాజిక సమీకరణాలు, వలసదారుల ప్రభావం, ఐటీ-రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణే రేపటి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

# ‘మీభూమి బ్లాక్ చెయిన్’

విజయవాడ ,భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే ‘మీభూమి?బ్లాక్ చెయిన్’ వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి?బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఔఎఅ ఆంధ్రప్రదేశ్, ఔఎఅ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్ సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలుకానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

## ఎవరినీ అడగని వివరణలు నన్నెందుకు అడుగుతున్నారు

ఒక కార్యక్రమంలో వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పక్కన కూర్చోవడం పై చెలరేగిన వివాదంపై టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేసారు. ఎవరినీ అడగని వివరణలు నన్నెందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. త్వరలో రాజకీయాలకు అతీతంగా కాపులు అందరూ ఏకం అవుతారు. గతంలో వైసీపీ నాయకుడు నిర్వహించిన సభకు జ్యోతుల నెహ్రూ, వంగవీటి రాధా వెళ్లారు, వాళ్లను ఇలాగే వివరణ అడిగారా అని అన్?నారు.నేను వైసీపీ నాయకులు నిర్వహించిన సభకు వెళ్లలేదు, జనసేన మాజీ నాయకుడు దాసరి రాము నిర్వహించిన ముద్రగడ పద్మనాభం సంతాప సభకు మాత్రమే వెళ్లాను. అక్కడ అంబటి రాంబాబు కనిపిస్తే మర్యాదపూర్వకంగా పలకరించాను. వంగవీటి రాధా, జ్యోతుల నెహ్రూ కూడా గతంలో వైసీపీ నాయకుడు జక్కంపూడి రాజా నిర్వహించిన సంతాప సభకు వెళ్లి, బొత్స సత్యనారాయణ లాంటి వైసీపీ నాయకులతో మాట్లాడారు.

# మోడీ చెప్పినట్టే: పార్లమెంటుకు పరీక్షల బిల్లు.. కానీ..!

న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన సెల్ఫీ వీడియోల్లో చెప్పినట్టుగానే నీట్ పరీక్ష సహా.. ఇతర ప్రవేశ పరీక్షలకు సంబంధించి పక్కా వ్యవహరించేలా ఉపకరించే కఠిన చట్టాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రం సర్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో -పబ్లిక్ ఎగ్జామినేషన్ అమెండ్ మెంట్ బిల్ -2026- ప్రవేశపెట్టింది. ఈ బిల్లు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ లో అక్రమ పద్దతులను నివారించడానికి ఉద్దేశించింది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అనుమతితో ఈ బిల్లును కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ సభలో ప్రవేశపెట్టారు.ఓటింగ్ అనంతరం బిల్లుపై చర్చకు అనుమతిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయితే.. ముందుగా చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఒకసారి ఓటింగ్ అయిపోయిన తర్వాత.. ఇక, చర్చించి ప్రయోజనం ఏంటన్నది వారి డిమాండ్. ఇక, ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యార్థుల ప్రయోజనాలకు కాపాడేందుకు, పరీక్షల ప్రక్రియను బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన సంస్కరణలపై సభలో చర్చించడమే అత్యంత ప్రాధాన్యత అంశంగా ఉండాలని పేర్కొన్నారు.విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపైనే ప్రభుత్వం దృఢంగా దృష్టి సారించిందని తెలిపారు. ఈ బిల్లును ఆమోదించడమే ప్రాధాన్యతా అంశమని... ఇది అత్యంత కీలకమైన, ముఖ్యమైన బిల్లని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు సభ దృష్టిని పక్కదారి పట్టించవద్దని కోరారు మరోవైపు.. విపక్షాలు తమ నిరసనలు కొనసాగించడంతో బిల్లును ప్రవేశ పెట్టిన పది నిమిషాల్లోనే లోక్‌సభ వాయిదా పడింది. వాయిదా తీర్మానానికి పట్టుబడుతూ... విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్ద నినాదాలు



ప్రారంభించారు.ఈ సమయంలో ఓంబిర్లా మాట్లాడుతూ... సభాసాంప్రదాయాలను సభ్యులందరూ... పాటించాలని... సభ్యుల హక్కు అయిన ప్రశ్నోత్తరాలు కొనసాగేలా సహకరించాలని కోరారు. అయినా... విపక్షాలు సహకరించకపోవటంతో సభను తొలుత మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఓంబిర్లా ప్రకటించారు. అనంతరం తిరిగి సభ ప్రారంభమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవటంతో సభను మరోసారి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా వాయిదా పర్వం కొనసాగింది. ఛైర్మన్ సీపీ. రాధాకృష్ణన్ అధ్యక్షతన సభ ప్రారంభంకాగానే .... వాయిదా తీర్మానానికి అనుమతించాల్సిందిగా సభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఛైర్మన్ ను కోరారు. దీనికి ఛైర్మన్ అంగీకరించకపోవడంతో వాయిదా వేశారు.

# తెలంగాణలో గ్రామీణ ప్రగతికి బాటలు



హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా హ్యామ్ విధానంలో 18,472 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగులో ఆగస్టు రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పనులను ప్రారంభిస్తారు. రవాణా సౌకర్యం లేని 179 మారుమూల గ్రామాలకు సైతం ఈ పథకం ద్వారా కొత్త రోడ్లు దక్కనున్నాయి. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు రంగం సిద్ధమైంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రకారం.. వచ్చే నెలలో ఈ బృహత్తర ప్రాజెక్టు లాంఛనంగా ప్రారంభం కానుంది. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ముందడుగు వేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల విస్తరణ, ఆధునికీకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం నమ్ముతోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానించేందుకు సరికొత్త ప్రణాళికలకు రూపకల్పన చేసింది. ఇప్పటికే మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానిస్తూ డబుల్ రోడ్లు వేయగా.. ఇప్పుడు గ్రామాల్లోని రోడ్లపై సర్కార్ ఫోకస్ పెట్టింది.రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ రోడ్ల నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభంకానున్నాయి. గిరిజన, వెనుకబడిన ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకొని కార్యచరణ సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ విధానంలో 6,703 గ్రామాలను కలుపుతూ 18,472 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాథమిక దశలో 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల మేర రహదారుల విస్తరణ, పునర్నిర్మాణ పనుల నిమిత్తం ఇప్పటికే టెండర్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇప్పటివరకు ఎలాంటి రవాణా లేదా రోడ్డు సౌకర్యం నోచుకోని 179 మారుమూల గ్రామాలను గుర్తించి, వాటిని అనుసంధానిస్తూ 934 కిలోమీటర్ల మేర రహదారులను ప్రాధాన్య క్రమంలో నిర్మించనున్నారు.ఈ ప్రాజెక్టుకు అవసరమైన భారీ నిధుల సమీకరణ కోసం పంచాయతీరాజ్ శాఖ భారతీయ రిజర్వ్ బ్యాంకు అనుమతి కోరుతూ అధికారికంగా లేఖ రాసింది. ఈ నెలాఖరు నాటికి ఆమోదం లభిస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమోదం రాగానే... వచ్చే నెల 15 నాటికి నిర్మాణ సంస్థలతో అధికారిక ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఆ తర్వాత ఆగస్టు రెండో వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పనులు ప్రారంభమై.. రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో పనులు వేగవంతం కానున్నాయి. ఈ రహదారులు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అంటున్నారు.

# కాంగ్రెస్ పుంజుకుంటే వైసీపీకి దెబ్బ ?



అమరావతి,జాతీయ స్థాయిలో చూస్తే కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగినట్లుగా కనిపిస్తోంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ జోడు సవారీతో హస్తం పార్టీలో స్పీడ్ కనిపిస్తోంది. దాంతో పాటు ఇటీవల విద్యార్థి ఉద్యమాలలో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో క్రియాశీలకంగా పాల్గొని తమ పాత్ర ఏంటో జాతీయ స్థాయిలో చూపించింది. సీజేపీ అగ్నికి కాంగ్రెస్ వాయువుగా తోడు కావడంతోనే కేంద్రం దిగి వచ్చింది అన్నది నిఖార్సు అయిన రాజకీయ విశ్లేషణగా ఉంది. పార్లమెంట్ ని స్తంభింపచేసే కేవలం ఇదే ఇష్యూ మీద కేంద్రం ఫోకస్ పెట్టేలా చేయడమే కాదు వీధుల్లోకి వచ్చి మరీ రాహుల్ గాంధీ మోడీ సర్కార్ ని ఇరుకున పెట్టాల్సినంతగా పెట్టేశారు.

మూడేళ్ళకు ముందే :

ఇక దేశంలో చూస్తే వేగంగా రాజకీయ సమీకరణలు మారుతున్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వానికి మూడేళ్ళ ఇంకా చేతిలో అధికారం ఉండగానే వరసగా సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఉత్సాహం అంతా కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా బ్లాక్ లో ఉంటే ఈ మధ్యనే పశ్చిమ బెంగాల్ వంటి స్టేట్ ని గెలిచి బీహార్ లో తొలిసారి అధికారం చేపట్టినా బీజేపీ శిబిరంలో మాత్రం ఎంతో కొంత కలవరం రేగుతోంది. దానికి కారణం వివిధ వర్గాలలో పెరుగుతున్న అసంతృప్తి. అంతే కాదు దేశంలో ఎవరిని అయినా అధికారాంలోకి తీసుకుని రావాలీ అంటే పెద్ద సంఖ్యలో ఉన్న యువత మోడీ సర్కార్ మీద ఆగ్రహం వ్యక్తం చేయడం. ఇవన్నీ కాంగ్రెస్ లో జోష్ పెంచుతున్నాయి.

అగ్ని పరీక్ష అక్కడే :

ఇక ఈ ఏడాది వరకూ ఎన్నికలు అయితే లేవు కానీ 2027లో మాత్రం బీజేపీకి అగ్ని పరీక్ష అనదగిన ఎన్నికలు రెండు కీలక రాష్ట్రాలలో ఉన్నాయి. అందులో ఒకటి ఉత్తర ప్రదేశ్ అయితే రెండవది గుజరాత్. ఈ రెండు స్టేట్స్ బీజేపీకి గుండె కాయ లాంటివి. అయితే గుజరాత్ మోడీ అమిత్ షాల సొంత రాష్ట్రం. పైగా మూడు దశాబ్దాలుగా అక్కడ కమలం పాగా వేసింది. ఈసారి ఎలా ఉంటుందో అన్న చర్చ సాగుతోంది. అలాగే 2027 నాటికి పదేళ్ళ బీజేపీ పాలన ఉత్తర ప్రదేశ్ లో పూర్తి అవుతుంది. అక్కడ 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని రెండో ప్లేస్ కి నెట్టేసి 37 ఎంపీ సీట్లను ఎస్పీ గెలుచుకుంది. దాంతో అసెంబ్లీ ఎన్నికల్లో సవాల్ చేసేందుకు రెడీగా ఉంది. కాంగ్రెస్ సైతం బాగానే పుంజుకుంటోంది. మజ్లిస్ పార్టీ అఖిలేష్ కూటమిలో చేరబోతోంది. దాంతో ఇక్కడ బీజేపీకి కఠిన పరీక్ష అని అంటున్నారు.

ఉత్తరాది నుంచే యూత్ :


ఇక సీజేపీ చేసిన పోరాటంలో ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల నుంచే విద్యార్థి యువత పాలు పంచుకున్నారని నివేదికలు తెలియచేసతున్నారు. అందులో యూపీ బీహార్ గుజరాత్, రాజస్థాన్ పంజాబ్ వంటి చోట్ల నుంచి అధికంగా వచ్చారని చెబుతున్నారు. ఇక్కడ పంజాబ్ తప్ప తక్కినవి అన్నీ బీజేపీ ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలే. మరి యువత ఆగ్రహం ఏంటో జంతర్ మంతర్ వద్ద అంతా చూశారు. వారి కేంద్ర మంత్రి రాజీనామాతో శాంతించినా బీజేపీ మీద అభిమానంగా ఉంటారని మునుపటి ఆదరణ చూపిస్తారు అని అనుకోవడం అత్యాశే అవుతుంది అని అంటున్నారు. వారు కనుక ఫేస్ టర్నింగ్ ఇచ్చుకుంటే అది కచ్చితంగా వచ్చే ఏడాది ఎన్నికల్లో బీజేపీకి భారీ షాక్ అవుతుందని అంటున్నారు. ఇక కాంగ్రెస్ కానీ ఆ పార్టీ కూటమి కానీ గెలిస్తే దేశంలో కొత్త రాజకీయ గాలికి అంకురార్పణ జరిగినట్లే అని అంటున్నారు.

ఏపీలో సీన్ ఏంటి :

ఇక్కడే ఏపీ గురించి కూడా ఎక్కువగా చర్చ సాగుతోంది. దేశంలో మళ్ళీ కాంగ్రెస్ పుంజుకుంటే దాని ప్రభావం ఎక్కువగా ఏపీ మీదనే ఉంటుంది అని అంటున్నారు. ఎందుకంటే మిగిలిన రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడు విజయ్ ప్రభుత్వంలో భాగంగా ఉంది. దాంతో ఏపీలో కాంగ్రెస్ మళ్ళీ బలపడేందుకు చూస్తుంది. అది కచ్చితంగా వైసీపీకి దెబ్బ తీస్తుందని అంటున్నారు. వైసీపీలో ఉన్న పాత కాంగ్రెస్ నేతలు అంతా మళ్ళీ ఖద్దర్ పార్టీకి జై కొడితే మాత్రం వైసీపీ ఆ మేరకు భారీ రాజకీయ నష్టాన్ని చూడొచ్చు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మొత్తం మీద చూస్తే 2029 కంటే ముందు 2027 నుంచే జాతీయ రాజకీయం ఏపీ రాజకీయంలో కూడా భారీ మార్పులు వచ్చే చాన్స్ ఉందని అంటున్నారు.

# బాబును మభ్యపెడుతున్న సర్వే సంస్థలు!

అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని పలు సర్వే సంస్థ మభ్యపెడుతున్నట్టుగా తెలుస్తోంది. పాలన అత్యద్భుతంగా వుందని, గతం కంటే ఎక్కువ సీట్లు 2029లో కూటమికి వస్తాయని కొన్ని సర్వే సంస్థలు చంద్రబాబుకు నివేదికలు ఇస్తున్నట్టు సమాచారం. కానీ కొందరు మాత్రం పాలన గాడి తప్పుతోందని, క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయం కూటమికి వ్యతిరేకంగా వుందని చంద్రబాబు చెవిలో వేస్తున్నారు.అయితే తియ్యటి మాటలే చంద్రబాబుకు వినసొంపుగా వుంటున్నాయి. ప్రభుత్వంపై నెగెటివ్ అనే మాట వినడానికి చంద్రబాబు చాలా ఇబ్బందికి గురి అవుతున్నారని తెలుస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని చెబుతున్న వారిని చంద్రబాబు దూరంగా పెడుతున్నారని కొంత మంది టీడీపీ సీనియర్ నాయకులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో టీడీపీకి ఎన్నికల ముందు నుంచి వ్యూహకర్తలుగా, అలాగే సర్వేలు చేస్తున్న సంస్థ ప్రతినిధులు తమ ప్రత్యర్థులతో సైతం కూటమి పాలనపై జనం ఆహా, ఓహో అంటున్నారని చెబుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీకి 11 ఎమ్మెల్యే, నాలుగు లోక్‌సభ సీట్లు వచ్చాయని గుర్తు చేయడంతో పాటు రాబోవు ఎన్నికల్లో ఎలా వుంటుందో ఆ పార్టీ నాయకులతో నేరుగా చెబుతున్నారని తెలిసింది.2029 ఎన్నికల్లో వైసీపీ 11 నుంచి 8 సీట్లకు పడిపోతుందని ఆ పార్టీ నాయకులతో టీడీపీ వ్యూహకర్తలు చెబుతుండడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. చంద్రబాబును ఎంతగా మభ్యపెడుతున్నారో అర్థమవుతోందని మనసులో అనుకుంటూ, ఇదే రకంగా ముందుకెళ్లాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. ఎందుకంటే, గతంలో ఇదే రీతిలో తమ నాయకుడు వైఎస్ జగన్‌ను కొందరు సర్వే నిపుణులు భ్రమల్లో ముంచి, వాస్తవాలకు విరుద్ధంగా వ్యవహరించేలా చేశారని వైసీపీ నేతలు గుర్తు చేసుకుంటున్నారు.ఇప్పుడు చంద్రబాబు వద్ద కూడా అదే రకమైన టీమ్ పని చేస్తున్నట్టు అర్థమవుతోందని వైసీపీ నాయకులు అంటున్నారు. ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాంటి అబద్ధాలు, వాస్తవ విరుద్ధ సర్వే నివేదికలు ఇచ్చే వారికే నాయకుల అండదండలుంటాయని మరోసారి రుజువు అవుతున్నట్టు వైసీపీ



నేతలు చెబుతున్నారు.ఒకవైపు చంద్రబాబు మనసేమో, క్షేత్రస్థాయిలో ఏదో తేడా కొడుతున్నట్టు నమ్ముతోంది. కానీ అద్భుతం, అమోఘం అని చెప్పేవారి మాటల వైపే చంద్రబాబు మొగ్గు చూపుతున్నారని టీడీపీ సీనియర్లు అంటున్నారు. నిజాలెవరికీ చెవికెక్కవనేందుకు తమ నాయకుడు చంద్రబాబు అతీతం కాదని వారు అంటున్నారు.ముఖ్యంగా మూడు పార్టీలు కలిసి ఉన్నంత వరకూ, ప్రభుత్వంపై వ్యతిరేకత పని చేయదనే రాంగ్ ఫీడ్‌బ్యాక్ చంద్రబాబుకు ఇస్తున్నట్టు తెలుస్తోంది. కూటమి పరిపాలనపై మాత్రం ఎన్నికలు జరుగుతాయనే వాస్తవాన్ని విస్మరిస్తున్నారని టీడీపీ సీనియర్లు వాపోతున్నారు. అద్భుతం అని చెప్పే వారి గళాల ముందు, నెగెటివ్ అభిప్రాయం తేలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎవరేం చెప్పినా శ్రద్ధగా విని, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని పలువురు అంటున్నారు. కానీ అధికారంలో వుంటే, తియ్యటి మాటల్ని తప్ప, చేదు అంశాల్ని పట్టించుకోరని ఆయన్ను దగ్గరగా చూసిన వాళ్లు చెబుతున్నారు. ఒకట్రెండుసార్లు పాలనపై వాస్తవాల్ని చెప్పడానికి ప్రయత్నించి, ఆయన ఆగ్రహానికి గురై, ఆ తర్వాత మనకెందుకులే అని నోర్మూసుకుంటున్నట్టు టీడీపీ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బోండా ఒక్కడిదేనా అలజడి...ఇంకా ఉన్నారా ?



అమరావతి,కాపుల్లో అలజడి అని టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తాజాగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో చేసిన హాట్ కామెంట్స్ రాజకీయ అలజడినే పుట్టించాయి. ప్రత్యేకించి టీడీపీలో అయితే మరింతగా అవి ప్రకంపనలు రేపుతున్నాయి. కాపులలో అలజడి అని బొండా అన్నా దానికి రాజకీయ విశ్లేషకులు వేరే విధంగా అన్వయిస్తున్నారు. బోండాలోనే అలజడి ఉందని అంటున్నారు. ఆయన బాధను కాపుల మొత్తం బాధగా చేశారు అని కూడా అంటున్న వారు ఉన్నారు. ఆ మాటకు వస్తే కాపులలో టీడీపీ కాపులు వేరయ్యా అన్నట్లుగా ఈ అలజడి ఆ పార్టీ కాపులలో ఉందని కూడా విశ్లేషిస్తున్నారు. సరే ఫైర్ బ్రాండ్ కాబట్టి బోండా స్పీడ్ పెంచారు, పెద్ద నోరు చేశారు అని అనుకుంటే మిగిలిన వారిలో అలజడి ఉందా ఉంటే వారి సంగతేంటని చర్చ మొదలైంది.

బ్యాక్ బెంచ్ అనుకుంటూ :

ఏపీలో టీడీపీకి 2024లో అధికారం దక్కింది. కానీ అది 2014 నుంచి 2019 దాకా ఉన్నంత సుఖంగా లేదని తమ్ముళ్ళు అంటున్నారు. ఎలా అంటే ఈసారి ఇతర పార్టీలతో కలసి టీడీపీ అధికారం పంచుకుంది. ఆ మేరకు ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎంపీ సీట్ల దగ్గర నుంచి ఆ మీదట కేబినెట్ మంత్రి పదవుల దాకా కోత పడింది అన్నది అయితే ఉంది. ఇక జనసేనను ఎక్కువగా కాపు సామాజిక వర్గం అభిమానిస్తుంది అన్నది ఉంది. దాంతో జనసేన కోటా వాటా ఇచ్చేశాక టీడీపీలో కాపులకు బ్యాక్ బెంచ్ ని చూపిస్తున్నారు అన్న అసంతృప్తి అయితే చాలా మందిలో ఉందని ప్రచారం సాగుతోంది. గతంలో మంత్రి పదవులు ఆ సామాజిక వర్గం నుంచి చేపట్టి ఈసారి చాన్స్ దక్కని వారి నుంచి కొత్తగా మంత్రి పదవులు అందుకుందామని ఆశపడిన వారి వరకూ అందరూ కూడా ఈ పరిణామాలతో నీరసపడి ఉన్నారని ప్రచారం అయితే సాగుతోంది.

ఇదే తొలిసారి కాదు :

ఇక బోండా ఈ తరహా వ్యాఖ్యలు చేసింది ఇదే తొలిసారి కాదు అని గుర్తు చేస్తున్నారు. ఈ మధ్యనే టీడీపీ కూటమి రెండేళ్ళ పండుగ విజయోత్సవాలలో కూడా ఆయన కొన్ని వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇవ్వడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు అని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే బోండా ఉమా అసంతృప్తి కాపులలో అలజడిగా మారిందని అంటున్నారు. ఇక ఆయనతో పాటుగా మరి కొంతమంది కూడా ఉండే ఉంటారు అని అంటున్నారు.

పదవులు దక్కవనే :

టీడీపీ వరకూ చూస్తే సమీకరణలు సామాజికంగా రాజకీయంగా సరిపోతున్నాయి. కానీ టీడీపీలో ఉన్న వారికి మాత్రం ఎక్కడా మింగుడు పడడం లేదు, తమ వరకూ పదవులు రావడం లేదనే వారి ఆవేదనగా చెబుతున్నారు. గతంలో అయితే టీడీపీ ప్రధానంగా కాపులకు పెద్ద పీట వేసేది అని గుర్తు చేస్తున్నారు. విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు, అలాగే శ్రీకాకుళం నుంచి కిమిడి కళా వెంకట్రావు, తూర్పు గోదావరి జిల్లా నుంచి నిమ్మకాయల చిన రాజప్ప వంటి వారు మంత్రులు అయ్యారు. ఇపుడు చూస్తే సీన్ మారింది. కాపుల అండ ఉన్న జనసేన మిత్రపక్షం అయింది. దాంతో టీడీపీ హైకమాండ్ ఆ మేరకు బేఫికర్ గా ఉండొచ్చు కానీ అదే సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కాపులు అయితే నలిగిపోతున్నారు అని అంటున్నారు. అందుకే మంత్రి పదవి కావాలన్నా లేక ఇతర అందలాలు దక్కాలన్నా టీడీపీలో అయ్యే పనేనా అన్న చర్చ మొదలైందని అదే కాపుల అలజడిగా రూపాంతరం చెందుతోంది అని అంటున్నారు. మరి చూడాలి ఈ అలజడి తీరం దాటకుండా అక్కడే ఆగుతుందా లేక తాకుతుందా అన్నది అని అంటున్నారు.

# పాలమూరు జిల్లాల్లో మాల్దీవుల తరహాలో సోమశిల

మహబూబ్ నగర్,అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13.75 కోట్లతో భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. మన్ననూర్, సలేశ్వరం, సోమశిల, దోమలపెంట ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక సర్క్యూట్లను అభివృద్ధి చేయనున్నారు. సోమశిలను మినీ మాల్దీవులుగా తీర్చిదిద్దడంతో పాటు, దోమలపెంటలో క్రూయిజ్ విహారం, ఫర్హాబాద్‌లో సాహస క్రీడలు, చెంచు గిరిజనులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నారు.లాహిరి.. లాహిరి.. లాహిరిలో... అంటూ అందాల నల్లమల అడవుల మధ్యలోని కృష్ణా బ్యాక్‌వాటర్‌లో బోటింగ్, సాహస క్రీడలు, ట్రెక్కింగ్ మార్గాలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పర్యాటకులకు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమ్రాబాద్ అడవులను అంతర్జాతీయ ప్రమాణాలతో ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రకృతి సంపదను కాపాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం, స్థానిక చెంచు గిరిజనులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా రూ.13.75 కోట్లతో ఎకో టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. అటవీశాఖ, అటవీ అభివృద్ధి సంస్థ, పర్యాటక అభివృద్ధి సంస్థలు ఇటీవల ఈ ప్రణాళికలపై చర్చించగా.. మన్ననూర్, సలేశ్వరం, సోమశిల, దోమలపెంట, ఫర్హాబాద్ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక సర్క్యూట్లు రూపుదిద్దుకోనున్నాయి.మన్ననూర్ అభివృద్ధికి రూ.7.20 కోట్లను కేటాయించగా.. ఈ నిధులతో ఫర్హాబాద్‌లో కొత్త వాచ్ టవర్, ప్రతాపరుద్ర కోట అభివృద్ధి, ఉమామహేశ్వరం ఆలయం వద్ద గెజిబోకు రూ.70 లక్షలు, ఆధునిక సఫారీ వాహనాలు, ప్రత్యేక టూరిస్టు బస్సులకు రూ.3.5 కోట్లు, ప్రధాన ప్రవేశ ద్వారాలకు రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. ఇక కృష్ణా నది బ్యాక్‌వాటర్ అందాలతో ఆకట్టుకునే సోమశిలను మినీ మాల్దీవులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూ.5.50 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా హైస్పీడ్ జెట్ స్కీయింగ్‌కు రూ.కోటి, ఎకో ఫ్రెండ్లీ వసతికి రూ.కోటి, సన్‌సెట్ బోటింగ్‌కు రూ.1.50 కోట్లు, ట్రైల్స్, ఏటీవీ రూట్లు, వ్యూపాయింట్లకు రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నారు.సలేశ్వరం-మన్ననూర్ సర్క్యూట్ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించగా.. ఇక్కడ మన్ననూర్ గేట్‌వే, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ట్రెక్కింగ్, సందర్శకుల ప్రవేశ-నిష్క్రమణ వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. చెంచుల జీవన విధానం తెలుసుకునే కేంద్రం, సావనీర్ షాప్‌లను కూడా ఇక్కడ



అభివృద్ధి చేయనున్నారు. మరోవైపు దోమలపెంటలో కృష్ణా బ్యాక్‌వాటర్‌లో దోమలపెంట నుంచి అక్కమహాదేవి గుహల వరకు క్రూయిజ్ బోటు సేవలను ప్రారంభించనున్నారు. ఒక్కోటి 12 సీట్లు ఉండే మూడు బోట్లతో ఈ సేవలను నిర్వహించడానికి రూ.55 లక్షలు కేటాయించారు. సందర్శకుల వసతి, వ్యూపాయింట్ల ఏర్పాటు ద్వారా దోమలపెంటను కొత్త పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ ప్రాజెక్టును అత్యంత వ్యూహాత్మకంగా మూడు దశల్లో అమలు చేయనున్నారు. తొలి దశలో 2026-27 నాటికి సలేశ్వరం సర్క్యూట్, సోమశిల, దోమలపెంట మార్గాలను అభివృద్ధి చేస్తారు. రెండో దశలో 2027-29 నాటికి ఫర్హాబాద్ వాచ్ టవర్, ప్రతాపరుద్ర కోట, ఉమామహేశ్వరం గెజిబో, సోమశిలలో జెట్ స్కీయింగ్, సన్‌సెట్ బోటింగ్, దోమలపెంట క్రూయిజ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. తుది దశగా 2030 నాటికి కొత్త సఫారీ వాహనాలు, సోమశిలలో ఎకో ఫ్రెండ్లీ రిసార్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## వైసీపీ మాజీ మంత్రి రోజాకు నోటీసులు

తిరుపతి, తిరుపతి ఈస్ట్ పోలీసులు వైసీపీ మహిళా నేత, మాజీ మంత్రి ఆర్కే రోజాకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనపై అక్రమ కేసులు బనాయించిందని రోజా ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారని, బెదిరింపులకు భయపడేది లేదని ఆమె స్పష్టం చేశారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140